సాక్షి ప్రకాశం

శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



మాదిగల ఎంపీ సీటు టీడీపీ అమ్ముకుంది

గతంలో మాదిగలకు కేటాయించిన ఎంపీ సీటును టీడీపీ అమ్ముకుందని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో..



మానవతావాది.. చంద్రశేఖరరెడ్డి

గొప్ప మానవతావాది.. ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. అపుస్మా ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33 /19

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్



విజయవాడలోని రాజ్‌భవన్‌లో నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

నేడు ఎన్నికల అబ్జర్వర్ పర్యటన

ఒంగోలు టౌన్: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నియోజకవర్గ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్‌గా కోన శశిధర్‌ను నియమించారు. శనివారం ఆయన ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పర్యటించి ఎన్నికల ప్రక్రియను పరిశీలించనున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు ఏమైనా ఉంటే 9391923114కు ఫోన్ ద్వారా సంప్రదించాలని లేదా మెసేజ్ పంపవచ్చు.

ఏకేయూ లోగో తయారీకి ముందుకు రావాలి

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం (ఏకేయూ) లోగో రూపొందించేందుకు ఔత్సాహికులు ముందుకు రావాలని విశ్వవిద్యాలయం ఓఎస్‌డీ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. లోగో తయారు చేసేందుకు జిల్లా, ఇతర ప్రాంతాల్లోని కళాకారులు, ప్రజల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. లోగోలో ప్రకాశం జిల్లా చిహ్నాలు, జిల్లా సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉండాలన్నారు. లోగో రూపొందించిన వారిని విశ్వవిద్యాలయం తరఫున ఘనంగా సత్కరిస్తామని, లోగో రూపొందించిన వారు ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి తమ నమూనాను పంపాలని కోరారు.

పసివాడికి ఆరోగ్యశ్రీ భరోసా



డాక్టర్ యాదాల అశోక్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న బాలుడు ప్రకాష్ కుటుంబ సభ్యులు

టంగుటూరు: అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడికి ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తోంది. టంగుటూరు మండలం జయవరం గ్రామానికి చెందిన పెద్దకత్తుల వెంకట్రావు కుమారుడు ప్రకాష్‌కి చిన్ననాటి నుంచి హార్మోన్ గ్రోత్ డెఫిషియన్సీ అనే వ్యాధి ఉంది. ఆ వ్యాధికి వయస్సు, బరువుని బట్టి ఇంజెక్షన్ ప్రతి రోజూ వాడాల్సి ఉంటుంది. ఒక ఇంజక్షన్ బాటిల్‌ను 15 రోజుల పాటు వాడవచ్చు. దాని విలువ రూ.13 వేలు. బాబుకి ప్రస్తుతం 13 సంవత్సరాలు. ఆ ఇంజెక్షన్ 16 సంవత్సరాల వయసు వచ్చే వరకు వాడాలని వైద్యులు తెలిపారు. ఇంజక్షన్‌ల ఖర్చే నెలకు రూ.26 వేలు అవుతుంది. ఇంటింటికీ తిరిగి బూరలు అమ్ముకుంటూ బతికే నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం చేయించడం భారమైంది. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ద్వారా రాష్ట్ర ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ చొరవతో ఆ బాబుకు 16 సంవత్సరాలు వచ్చే వరకు ప్రతి నెలా అవసరమైన రెండు ఇంజెక్షన్లు అందించేలా మంగళగిరి ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రి వారు ఇంజెక్షన్లు సమకూర్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఒంగోలులో డాక్టర్ యాదాల అశోక్‌ని ఆయన కార్యాలయంలో ప్రకాష్ కుటుంబ సభ్యులతో పాటు, జయవరం నాయకుడు మేదరమిట్ల భరత్‌రెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పునరావాస కాలనీల అభివృద్ధికి చర్యలు

- జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల్లోని ప్రజలకు నిర్మిస్తున్న పునరావాస కాలనీల అభివృద్ధికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ చెప్పారు. శుక్రవారం ఆయన ఇడుపూరులో నిర్మాణంలో ఉన్న వెలిగొండ పునరావాస కాలనీలను స్పెషల్ కలెక్టర్ సరళావందనం, సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌లతో కలసి పరిశీలించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మాట్లాడారు. పునరావాస కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ తదితర సౌకర్యాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేవరాజు గట్టు, వేములకోట వద్ద మాత్రమే కొందరికి ఇళ్లపట్టాల పంపిణీ చేయాల్సి ఉందని త్వరలో వీరికి కూడా ఇస్తామన్నారు. కాలనీల్లో గుడి, బడి, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు కూడా పూర్తయ్యాయని అన్నారు. అర్హులందరికీ ఆర్ ఆర్ ప్యాకేజీ వస్తుందని తెలిపారు.

మొక్కజొన్న సాగు బహుబాగు..!

బహుళ ప్రయోజనకారి మొక్కజొన్న సాగు వైపు అన్నదాత ఆసక్తి చూపిస్తున్నాడు. పెట్టుబడి స్వల్పం..నీటి అవసరం కూడా తక్కువే.. ఏడాది పొడవునా డిమాండ్ ఉండే వాణిజ్య పంట మొక్కజొన్న. ప్రభుత్వం కూడా మద్దతు ధర కల్పిస్తుండటంతో మిగిలిన వాణిజ్య పంటలకన్నా మొక్కజొన్న సాగు లాభదాయకంగా ఉంటోంది. దీంతో ఖరీఫ్, రబీ సీజన్లలో గతం కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు.

- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి
- మార్కెట్‌లో మంచి గిరాకీ
- ఆసక్తి చూపిస్తున్న రైతులు
- మద్దతు ధర కల్పిస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 21,960 ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.45 వేల వరకు మిగులు



ఏపుగా పెరిగిన మొక్కజొన్న

దర్శి టౌన్:

మొక్కజొన్నను ఆహారంగానే కాకుండా దాణా రూపంలో పశువులకు మేతగానూ, వివిధ పరిశ్రమల్లో ముడి సరకుగానూ ఉపయోగిస్తారు. అతి తక్కువ ఖర్చుతో స్వల్ప కాలంలో అధిక దిగుబడులిచ్చే ఈ పంటపై రైతులు దృష్టి సారిస్తున్నారు. సాధారణ పంటల సాగు ద్వారా ఆదాయం రాకపోవడంతో రైతులు వాణిజ్య పంటగా పేరున్న మొక్కజొన్న సాగు చేయడానికి ముందుకొస్తున్నారు. జిల్లాలో అధిక మండలాల్లో మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో మొక్కజొన్న సాధారణ సాగు 2,962 ఎకరాలు కాగా, 7,887 ఎకరాల్లో సాగు చేశారు. అదే విధంగా రబీలో సాధారణ సాగు 12,740 ఎకరాలు కాగా, 14,072 ఎకరాల్లో సాగు చేశారు. మొత్తం మీద 21,960 ఎకరాల్లో సాగు చేశారు.

లాభాలు అధికం...

మొక్కజొన్న పంటకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో పాటు పంటకు తక్కువ పెట్టుబడి, తక్కువ నీరే అవసరం కావడంతో ఈ పంటపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా వీటిని పొట్ట రూపంలో చిల్లర మార్కెట్‌లో విక్రయించి లాభాలు ఆర్జించవచ్చు. పొట్ట నుంచి విత్తనాలు వేరు చేసి పశువులు, చేపల ఫీడింగ్ కోసం సైతం వినియోగించుకోవచ్చు. అలాగే వీటి పౌడర్‌ను పలు రకాల వంటకాల్లో వినియోగించవచ్చు. ఈ విధంగా లాభాలు అధికంగా వచ్చే అవకాశం ఉండటంతో ఎక్కువగా సాగు చేస్తున్నారు.

మంచి దిగుబడి

మొక్కజొన్న ఎకరానికి 30 నుంచి 35 బస్తాలు వస్తుండటం, మార్కెట్‌లో ధర కూడా బాగా ఉండటం రైతులకు కలిసి వచ్చింది. క్వింటా బస్తా రూ.2,200 వరకు పలుకుతోంది. ఎకరాకు సరాసరి 33 బస్తాలు వచ్చినా ఆదాయం రూ.70,950 వస్తుంది. అందులో రూ.25 వేలు పెట్టుబడిపోను రూ.45,950 వరకు మిగులుతుండటంతో రైతులు ఎంతో ఉత్సాహంగా దీని సాగుపై మొగ్గు చూపుతున్నారు.

ప్రభుత్వం దన్ను

గత ఏడాది బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్న ధర తక్కువగా ఉండటంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేసింది. ఫలితంగా రైతులకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అదనపు ఆదాయం సమకూరింది. ఆ ఏడాది ప్రభుత్వం మద్దతు ధర రూ.1,850 ప్రకటించింది. ప్రస్తుతం దీని ధర ప్రభుత్వ మద్దతు ధర కన్నా మార్కెట్‌లో అధికంగా ఉంది.



మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యల గురించి తెలుసుకుంటున్న రైతులు



మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న అధికారులు



మాధవరంలో ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న నాణ్యతను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఆర్థికంగా ప్రయోజనం



మిగిలిన పంటల కంటే వాణిజ్య పంట పండించిన రైతుల పరిస్థితులు బాగున్నాయి. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ఇచ్చిన సూచనల ప్రకారం సాగు చేస్తే మొక్కజొన్న వలన ఆర్థిక ప్రయోజనం ఉంటుంది. రైతులకు ఇబ్బందులు లేకుండా సరుకు సకాలంలో కొనుగోలు చేసేలా అధికారులు పనిచేస్తున్నారు.

– ఐ.వెంకటరెడ్డి, రైతు, తాళ్లూరు

పెట్టుబడి ఖర్చు తక్కువ



వరి, పత్తి, మిరప, ఇతర పంటలతో పోలిస్తే పెట్టుబడి తక్కువ. మిగిలిన పంటలు కొంత మేర కొనుగోలు కష్టంగా ఉన్నా సరే మొక్కజొన్నకు డిమాండ్ బాగా ఉంది. అదేస్థాయిలో అమ్ముడుపోతోంది. గత సంవత్సరం నుంచి అధికంగా మొక్కజొన్న సాగు చేస్తున్నాం.

– కోట వెంకటేశ్వర్లు, తాళ్లూరు

వాణిజ్య పంటలే మంచిది



మొక్కజొన్న సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల వలన విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని కొత్త పైర్ల వైపు యువ రైతులు మొగ్గు చూపుతున్నారు. నూతన పోకడల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే ప్రయోజనం ఉంటుంది.

– ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి, ఒంగోలు

దిగుబడులు బాగున్నాయి



వరికి అధిక పెట్టుబడులు అవుతుండటంతో పాటు మార్కెట్‌లో ధరలు కూడా నిలకడగా ఉండటం లేదు. దీంతో ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్నకు డిమాండ్ పెరిగి అమ్ముకున్నారు. అధిక మొత్తంలో మొక్కజొన్న సాగు చేశాం. నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాం. పెట్టుబడిపోనూ ఎకరాకు రూ.25 వేల వరకు మిగిలితే చాలు.

– ఇడమకంటి వెంకటరెడ్డి, కౌలు రైతు, తాళ్లూరు

మాగుంట రాఘవరెడ్డిపై కేసు రాజకీయ కుట్రే

- మాగుంట కుటుంబాన్ని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని చూడటమే
- ఢిల్లీ లిక్కర్ స్కాంలో వీళ్లకేం సంబంధం
- ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మనోధైర్యంగా ఉండాలి
- మాగుంట రాఘవరెడ్డికి ఒంగోలు నుంచే రాజకీయ భవిష్యత్తును ఇస్తాం
- మాగుంట కుటుంబానికి మేమందరం అండగా ఉంటాం
- ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి భరోసా



ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలసిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: రాజకీయ కుట్రలో భాగంగానే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డిపై కేసు నమోదు చేశారని ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఒంగోలు నగరంలోని రామ్ నగర్‌లో ఉన్న ఒంగోలు ఎంపీ మాగుంట కార్యాలయానికి బాలినేని శుక్రవారం వచ్చారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డితో కొంతసేపు మాట్లాడారు. ఆయనలో ధైర్యాన్ని నింపారు. అనంతరం అక్కడే బాలినేని మీడియాతో మాట్లాడారు. రాజకీయ కుట్ర చేసి అబ్బాయి మాగుంట రాఘవరెడ్డిని అన్యాయంగా కేసులో ఇరికించారని మండిపడ్డారు. మాగుంట కుటుంబం గురించి జిల్లా ప్రజలందరికీ తెలుసన్నారు. ఎలాంటి తప్పులు చేసే కుటుంబం కాదు మాగుంట కుటుంబమన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో వేరేవాళ్ల కోసం మాగుంట కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారన్నారు. రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని, కావాలని అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ''మాగుంట కుటుంబం 1991లో ప్రకాశం జిల్లాకు వచ్చారు. అప్పట్లో మాగుంట సుబ్బరామిరెడ్డి ఒంగోలు ఎంపీగా గెలిచి జిల్లాకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. మంచినీటి దాతగా గొప్ప పేరు సంపాదించారు. సేవ చేయటానికే మాగుంట కుటుంబం నెల్లూరు నుంచి జిల్లాకు వచ్చారు. అటు రాజకీయంగా కానీ, ఇటు వ్యక్తిగతంగా కానీ విభేదాలు లేకుండా అందరినీ కలుపుకుపోయే కుటుంబం వారిది. 1995లో మాగుంట సుబ్బరామిరెడ్డి హఠాన్మరణం పొందినప్పుడు ఆయన తమ్ముడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి బాధపడటం చూశాను. 28 సంవత్సరాల తరువాత ఆయన కుమారుడిపై అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేసినప్పుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి బాధ పడటం మళ్లీ ఇప్పుడు మాత్రమే చూస్తున్నాను. అబ్బాయిని కేసులో ఇరికించటం చాలా బాధాకరం. నా చిన్నప్పటి నుంచి మాగుంట కుటుంబం లిక్కర్ వ్యాపారం చేస్తున్న సంగతి నాకు తెలుసు. రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని చూడటం మంచి పద్ధతి కాదు. జిల్లా ప్రజలు మాగుంట కుటుంబానికి అండగా ఉంటారు'' అని బాలినేని భరోసా ఇచ్చారు. ఆ కుటుంబం చేసిన సేవా కార్యక్రమాలు ఏ ఒక్కరూ మరిచిపోలేరని కూడా గుర్తు చేశారు. మాగుంట కుటుంబానికి అందరం అండగా ఉందామని పిలుపునిచ్చారు. బిడ్డను అరెస్ట్ చేస్తే ఎవరికైనా బాధ ఉంటుందన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ధైర్యంగా ఉండాలని సూచించారు. మాగుంట కుటుంబం కోసం ఏం చేయటానికైనా తాను సిద్ధంగా ఉన్నానని ధైర్యాన్నిచ్చారు. శీనన్న మనోధైర్యాన్ని తెచ్చుకొని మనసును కుదుట పరుచుకోవాలని సూచించారు. తాను ఢిల్లీ వెళ్లి మాగుంట శ్రీనివాసులు రెడ్డితో మాట్లాడినప్పుడు ఇది ఓదార్పు కాదు ధైర్యాన్ని ఇవ్వటానికి వచ్చానని అప్పుడే చెప్పానని బాలినేని అన్నారు. రాఘవరెడ్డిని రాజకీయాల్లోకి తీసుకొద్దామని భరోసా ఇచ్చారు. ఒంగోలు నుంచే తనకు రాజకీయ భవిష్యత్తును ఇచ్చేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధినేత, అప్పటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమంగా కేసులు పెట్టి వేధించారని గుర్తు చేశారు. ఆ తరువాత కష్టపడి 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించి ముఖ్యమంత్రి అయ్యారని గుర్తు చేశారు. మంచినీటి దాత, విద్యా దాతగా ఉన్న మాగుంట కుటుంబానికి ధైర్యాన్నిచ్చి అందరం అండగా ఉందామని బాలినేని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఆర్యవైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, గంటా రామానాయుడు, తాతా ప్రసాదు, కుప్పా రంగనాయకులు, బెల్లం సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, వాయల మోహన రావు, గొర్రెపాటి శ్రీనివాసులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

అ'ధర'హో..

- ప్రారంభమైన పొగాకు వేలం
- తొలి రోజు కేజీ రూ.200 లెక్కన 98 శాతం బేళ్లు కొనుగోలు
- 4 ప్లాట్‌ఫాంలలో 108 పొగాకు బేళ్లలో రెండు తిరస్కరణ



ఒంగోలు-1 వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న పొగాకు బోర్డు మెంబర్ మారెడ్డి సుబ్బారెడ్డి

చీమకుర్తి: రైతుల ఆశలు వమ్ముకాలేదు. పడిన కష్టానికి, పెట్టిన ఖర్చులకు మంచి గిట్టుబాటు ధర రావచ్చని రైతులు బయ్యర్‌లపై ఉంచిన నమ్మకం నెరవేరింది. పొగాకు వేలం జిల్లాలో శుక్రవారం ప్రారంభమైంది. ఆరంభంలో ధర అదిరింది. కేజీ పొగాకు రూ.200 పలికింది. గత ఏడాది మొదటి రోజు కేజీ రూ.185కు కొనుగోలు చేశారు. గత ఏడాదికంటే ఈ ఏడాది కేజీకి రూ.15 అదనంగా పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో మొత్తం 11 ప్లాట్‌ఫాంలు ఉండగా వాటిలో ఫేజ్-1లో ఒంగోలు-1, పొదిలి, వెల్లంపల్లి, కొండపి వేలం కేంద్రాల్లో శుక్రవారం పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఒంగోలు-1లో 45 పొగాకు బేళ్లు, పొదిలిలో 27, వెల్లంపల్లిలో 18, కొండపిలో 18 బేళ్లు చొప్పున మొత్తం 108 బేళ్లకు బోర్డు అధికారులు అనుమతినిచ్చారు. వాటిలో ఒంగోలు-1లో కంప్యూటర్ రిజెక్షన్ (సీఆర్) కారణంగా రెండు బేళ్లు మాత్రం తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 43 బేళ్లను బయ్యర్లు కొనుగోలు చేశారు. నాలుగు ప్లాట్ ఫాంలలో మొత్తం 108 బేళ్లు విక్రయానికి రాగా 106 బేళ్లను కేజీ రూ.200 లెక్కన కొనుగోలు చేశారు. తొలి రోజున ఐటీసీ, జీపీఐ, అలయెన్స్, పీటీపీ, ముస్తాఫా, విజయభారతి, మారుతి కంపెనీలు హాజరయ్యాయి.

'9' సెంటిమెంట్

జిల్లాలో శుక్రవారం పొగాకు నాలుగు ప్లాట్‌ఫాంలలో కొనుగోళ్లు ప్రారంభం కాగా ప్లాట్‌ఫాంల వారీగా పొగాకు బేళ్లను కేటాయించటంలో బోర్డు అధికారులు '9' నెంబర్ సెంటిమెంట్‌ను అనుసరించారు. పొగాకు బేళ్ల సంఖ్య మొత్తం కూడితే '9' వచ్చేలా పొగాకు బేళ్లను కేటాయించారు. బేళ్ల కేటాయింపుల సంఖ్యను పరిశీలించినట్లయితే.. ఒంగోలు-1లో మొత్తం 45 బేళ్లను విక్రయానికి అనుమతినిచ్చారు. అలాగే పొదిలి ప్లాట్‌ఫాంలో కేటాయించిన బేళ్ల సంఖ్య 27, వెల్లంపల్లిలో 18, కొండపిలో 18 బేళ్లను వేరువేరుగా కేటాయించారు. వాటిని కూడితే 9 లెక్కన వస్తుంది. జిల్లాలో మొదటి రోజు వేలం ప్రారంభమైన 4 ప్లాట్ ఫాంలలో పెట్టిన బేళ్ల సంఖ్య మొత్తం కలిపితే 108. ఈ సంఖ్యను కూడినా '9' వస్తుంది. ఇలా మొదటి రోజు రైతులకు మేలు జరగాలని, సింగిల్ డిజిట్‌లో అత్యధిక స్థానంలో ఉన్న 9 సెంటిమెంట్‌ను బోర్డు అధికారులు అనుసరించారు.

ధర స్థిరంగా ఉండేలా చూడాలి

పొగాకు ప్రారంభం నాడు బయ్యర్లు రైతులకు ఇచ్చిన ప్రారంభ ధర కేజీకి రూ.200 ఇవ్వడం హర్షణీయమని పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. కొనుగోళ్లు ప్రారంభమైన సందర్భంగా సుబ్బారెడ్డి ఒంగోలు-1 వేలం కేంద్రాన్ని సందర్శించారు. కర్నాటకలో పొగాకు ధర గరిష్టంగా రూ.273 పలికిందని, ఆంధ్రాలో కూడా బయ్యర్లు రైతులకు కర్నాటకలో ఇచ్చిన ధర ఇవ్వాలని, కనీసం ప్రారంభ ధరకు తగ్గకుండా అంతకు మించి పైకి పెంచేలా చూడాలని బయ్యర్లను, అధికారులను కోరారు.

– మారెడ్డి సుబ్బారెడ్డి

ప్రభుత్వాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

- వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జే.శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ఒంగోలు టౌన్: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జే.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒంగోలు జనరల్ ఆస్పత్రిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సూపర్ స్పెషాలిటీ సేవల కోసం అవసరమైన పరికరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య రక్ష సేవలను మరింత విస్తరించాలని చెప్పారు. జనరల్ ఆస్పత్రిలోని ఓపీ విభాగాన్ని, లేబొరేటరీలు, చిన్న పిల్లల విభాగాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే వైద్య కళాశాల హెచ్‌ఓడీలతో విభాగాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు డిజిటల్ రూపంలో సమాచారం ఇవ్వాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీజీహెచ్‌లో మృతి చెందిన వారి మృతదేహాలను గౌరవంతో కుటుంబ సభ్యులకు అప్పచెప్పాల్సిన బాధ్యత ఉందని, అవసరమైతే నిర్దేశించిన ధరల ప్రకారం బయట వాహనాలను ఉపయోగించుకోవాలని సూచించారు. మందుల విషయంలో మెరుగైన విధానాలను అమలు చేస్తున్నామని, 48 గంటల్లో అవసరమైన మందులు ఆయా విభాగాలకు అందుతున్నాయని చెప్పారు. జనరల్ ఆస్పత్రిలో అందజేస్తున్న సేవలను సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ కమిషనర్‌కు వివరించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మూర్తి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ శ్రవణ్, ఎన్‌చార్జి సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ చైతన్య తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

మార్చి 4న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చి 4న స్థానిక పాత జిల్లా జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆదేశాల మేరకు జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా నూతన పాలసీలు, పనులకు సంబంధించి ఎలాంటి చర్చలు ఉండవని, వాటిపై ఎటువంటి నిర్ణయాలు ఉండవన్నారు.

క్లుప్తంగా

పంట కాలువలో పడి రైతు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సంపత్‌కుమార్

ముండ్లమూరు: మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామానికి చెందిన రైతు పంట కాలువలో పడి మృతి చెందారు. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎల్‌.సంపత్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గోరంట్ల వీర నారాయణ(58) శుక్రవారం ఉదయం పొలంలో పంటకు నీరు పెట్టేందుకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు తండ్రి ఇంటికి రాలేదని తెలియడంతో సాయంత్రం కుమారుడు హనుమంతరావు పొలానికి వెళ్లి వెతికాడు. పంట కాలువలో తండ్రి శవమై కనిపించడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

చీమకుర్తి: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం సంతనూతలపాడు మార్కెట్ యార్డు సమీపంలోని కర్నూల్ రోడ్డుపై జరిగింది. సంతనూతలపాడు మండలం మన్నవారిపాలెం గ్రామానికి చెందిన నిడమానూరి లక్ష్మీనర్సు (70) తాను సాగు చేస్తున్న టమోటా తోట వద్దకు సంతనూతలపాడు మెయిన్‌రోడ్డు మీదుగా ఒంగోలు వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో పొదిలికి చెందిన పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు చీమకుర్తి, సంతనూతలపాడు మీదుగా ఒంగోలు వైపు వెళుతోంది. ముందు వెళ్తున్న లక్ష్మీనర్సు బైకును వెనుక వస్తున్న బస్సు ఢీకొనడటంతో తీవ్రంగా గాయపడి రోడ్డుపై రక్తపు మడుగులోనే పడిపోయాడు. 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు రిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. సంతనూతలపాడు ఎస్సై బి.శ్రీకాంత్ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

26న ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం

ఒంగోలు టౌన్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13న చీఫ్ సెక్రటరీకి 50 పేజీల మెమొరాండాన్ని అందజేశామని, ఈనెల 26లోపున తమ డిమాండ్లను పరిష్కరించకపోతే అదే రోజున ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఒంగోలు రెవెన్యూ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశం, ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి గిరికుమార్ రెడ్డి, ఏపీ జేసీ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్ కృష్ణ మోహన్, ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రగంటి ఆంజనేయులు, వీఆర్‌ఏ సంఘం నాయకులు జి.బ్రహ్మయ్య, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- లోన్ యాప్ వేధింపులే కారణం

ఒంగోలు టౌన్: లోన్ యాప్ వేధింపులు తాళలేక ఒక చిరుద్యోగి శుక్రవారం సాయంత్రం ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి కథనం ప్రకారం.. నగరంలోని వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన బెల్లంకొండ నాగభూషణాచారి ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం ఆయన వివిధ లోన్‌యాప్‌ల ద్వారా లక్ష రూపాయల వరకు రుణం తీసుకున్నారు. మొత్తం డబ్బు చెల్లించినప్పటికీ ఓ యాప్ నిర్వాహకులు ఆయనను ఇంకా నగదు చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో నాగభూషణాచారి ఒక యాప్‌లో చేసిన అప్పు తీర్చడానికి మరో యాప్‌లో అప్పు తీసుకున్నారు. ఈ క్రమంలో రుణం చెల్లించలేదంటూ ఆయన కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి కాంటాక్ట్ నంబర్లకు పంపించారు. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగభూషణాచారి ఇంటిని శుభ్రం చేసే లైజాల్ తాగి ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. లోన్ యాప్ వేధింపులపై తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చెప్పారు.

మాదిగల ఎంపీ సీటు
టీడీపీ అమ్ముకుంది

- బడుగు వర్గాలను అక్కున చేర్చుకుంటున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి
- ఈనాడుకు విలువలే లేవు
- రానున్న ఎన్నికల్లో సింగిల్‌గానే వైఎస్సార్ సీపీ పోటీ
- రాష్ట్ర పురపాలక, పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: గతంలో తెలుగు దేశం పార్టీ తూర్పుగోదావరి జిల్లాలో ఎస్సీల ఉపకులమైన మాదిగ సామాజికవర్గానికి కేటాయించిన ఎంపీ సీటును వందల కోట్లకు అమ్ముకుందని, దళితులను మభ్యపెట్టి దండుకోవడమే ఆ పార్టీ నేతల నైజం అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తున్నారని, ఎమ్మెల్సీ టికెట్లు కేటాయించడంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు పెద్ద పీట వేశారని, చరిత్రలో లిఖించేలా ఎమ్మెల్సీ సీట్లను 11బీసీ, 2ఎస్సీ, ఒకటి ఎస్టీలకు కేటాయించిన అరుదైన సంఘటనను సీఎం సాధించారన్నారు. బడుగు, బలహీన వర్గాలను అక్కున చేర్చుకోవడమే కాకుండా దళితులను చేయిపట్టుకొని రాజ్యాధికారం వైపు అడుగులు వేయిస్తు గొప్ప సంస్కృతి ఆయనకే దక్కుతుందని, సీఎం వేస్తున్న ప్రతి అడుగులో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 4 సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి చక్కటి పాలన అందిస్తున్నారని, కరోనా కష్టకాలంలో సైతం పేదలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలను అందరికి అందేవిధంగా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతిపక్షాలు మాట్లాడలేని విధంగా రాష్ట్ర పాలన సాగుతుండటంతో ప్రజలను మభ్యపెట్టేందుకు దుష్ట చతుష్టయం విశ్వప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. పచ్చ పత్రికలు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నెత్తిన ఎక్కించుకొని అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని తెలిపారు.

విలువలను విస్మరించిన ఈనాడు

గన్నవరం ఘటనలో టీడీపీ బరితెగించి ప్రవర్తిస్తే.. పట్టాభిని జాతీయ నాయకుడిగా ఈనాడు సృష్టించి తప్పుడు వార్తలను రాస్తోందని ఆయన విమర్శించారు. ఇది ఆ పత్రిక దిగజారుడు తనానికి నిదర్శనమని, అసత్యాలను రాయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదన్నారు. ఒక సామాజిక వర్గానికి, ఒక పార్టీకి ఈనాడు కొమ్ముకాస్తుందని, ప్రజాస్వామ్యంలో ఉన్న మూలస్తంభాల్లో పత్రిక రంగం ఒకటని, అటువంటి స్థానంలో ఉన్న ఆ పత్రిక నైతిక బాధ్యతలు విస్మరించి తప్పుడు కథనాలు ప్రచురించడం శోచనీయమన్నారు. వెన్నుపోటుదారుడిని గద్దెఎక్కించేందుకు ఎన్ని అవాస్తవాలు వండి వార్చడం సరయినది కాదని, పత్రిక విలువలు, నిబద్ధతను కాలరాస్తున్నారని, నైతిక బాధ్యతతో వాస్తవ కథనాలను ప్రచురించాలని సూచించారు. ఇప్పటికైన ఈనాడు దినపత్రిక తప్పుఒప్పుకొని క్షమాపణచెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఒంటరిగానే పోటీ చేస్తాం...

సింహం ఒంటరిగానే వస్తుందని.. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆయన అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు, ముఖ్యంగా దళిత వర్గానికి సీఎం గొప్ప అవకాశాలను కల్పించారని, అటువంటి నాయకుడికి జీవితాంతం దళితులు రుణపడి ఉంటారని, మరోకసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవటానికి సిద్ధం అవుతున్నారని తెలిపారు. మార్చిలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరచిని అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎస్‌జీఐటీ విద్యాసంస్థల అధినేత ఆదిమూలపు విశాల్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు గోల్‌మాల్

- సింగరాయకొండలో రికార్డుల్లో నమోదు చేయకుండా రూ.13.91 లక్షలు డ్రా
- ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ విచారణలో వెల్లడి



పంచాయతీ కార్యాలయంలో విచారిస్తున్న డీఎల్‌పీఓ

సింగరాయకొండ: సింగరాయకొండ మేజర్ పంచాయతీలో నాలుగున్నర నెలల్లో జరిపిన లావాదేవీలకు సంబంధించి రూ.13,91,071ను రికార్డుల్లో నమోదు చేయకుండా డ్రా చేసినట్లు తన విచారణలో తేలిందని ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ తెలిపారు. నిధుల గోల్‌మాల్‌పై ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టిన ఆమె మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2022 జూన్ 2వ తేదీ నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు రికార్డులు తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈఓఆర్‌డీ ఎం.అంజలీదేవి 2021 సెప్టెంబర్ 9వ తేదీ నుంచి డిసెంబర్ 11వ తేదీ వరకు ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారని, ఆ సమయంలో ఒక్క బిల్లుపైనా సంతకం చేయలేదని ఆమె లిఖిత పూర్వకంగా తెలిపారన్నారు. కానీ ఆమె ఇన్‌చార్జిగా ఉన్న సమయానికి సంబంధించి రూ.5,67,281, జూనియర్ అసిస్టెంట్ శైలజ ఇన్‌చార్జిగా ఉన్న కాలనికి రూ.2,95,790, రామ్మోహనరావు సెక్రటరీగా ఉన్నప్పుడు రూ.4,44,000, ప్రస్తుత సెక్రటరీ శరత్ రూ.84 వేలు వెరసి మొత్తం రూ.13,90,071 నిధులను రికార్డులలో నమోదు చేయకుండా డ్రా చేశారని వెల్లడించారు. పంచాయతీలో 48 మంది సిబ్బంది ఉండగా 33 మందికి సీఎఫ్‌ఎంఎస్ అకౌంట్ ద్వారా వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. 15 మందికి మాత్రం నిబంధనలకు విరుద్ధంగా చెక్కుల ద్వారా జీతం ఇస్తున్నట్లు గుర్తించానన్నారు. బాలయోగి నగర్‌లో పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, దేవస్థానం భూమిని ఆక్రమించి డీకే పట్టా భూమిలో బిల్డింగు నిర్మించారని దీనిపై బాలయోగినగర్ వాసులు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై డీపీఓ నారాయణరెడ్డి ఆదేశాల ప్రకారం విచారణ చేపట్టామన్నారు. ఆ స్థలానికి పంచాయతీ కార్యదర్శి రామ్మోహనరావు ప్లాన్ అప్రూవల్ ఇచ్చారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. అనంతరం డీఎల్‌పీఓ పద్మ బాలయోగినగర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. సమగ్ర నివేదికను డీపీఓ ద్వారా కలెక్టర్‌కు అందజేస్తానని డీఎల్‌పీఓ తెలిపారు. ఈఓఆర్డీ ఎం.అంజనీదేవి, పంచాయతీ కార్యదర్శి శరత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పాపిశెట్టి వెంకటేశ్వర్లుస్వామి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పొట్టకూటికి వచ్చి విగతజీవిగా..

- కారు ఢీకొని గ్యాస్ స్టౌ మెకానిక్ మృతి



ప్రమాదంలో మృతి చెందిన బ్రహ్మేశ్వరరావు



నుజ్జునుజ్జయిన కారు, బైక్

నాగులుప్పలపాడు: బైక్‌పై ఊరూరా తిరుగుతూ గ్యాస్ స్టౌ మరమ్మతులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వ్యక్తిని కారు రూపంలో మృత్యువు బలితీసుకుంది. ఈ ఘటన శుక్రవారం ఉప్పుగుండూరు- నాగులుప్పలపాడు మధ్య 216 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. నాగులుప్పలపాడు ఎస్సై హరి బాబు కథనం మేరకు.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చందు బ్రహ్మేశ్వరరావు(45) గ్రామాల్లో మోటారుసైకిల్‌పై తిరుగుతూ గ్యాస్ స్టౌలు బాగుచేస్తుంటాడు. రోజూలాగే శుక్రవారం పని చేసుకుని ఒంగోలు నుంచి చీరాలకు తన మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో చీరాల నుంచి ఒంగోలు వైపునకు వేగంగా వస్తున్న ఓ కారు ఉప్పుగుండూరు-నాగులుప్పలపాడు మధ్య బైక్‌ను ఢీకొట్టడంతో బ్రహ్మేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విధి నిర్వహణలో మన్ననలు పొందాలి

- సెబ్ జాయింట్ కమిషనర్ అరుణారావు
- ఉత్సాహంగా ఎస్సై, సీఐల పాసింగ్ ఔట్ పరేడ్





మాట్లాడుతున్న అరుణారావు, గౌరవ వందనం స్వీకరిస్తున్న పోలీస్ అధికారులు

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించి ప్రభుత్వంతోపాటు ప్రజల మన్ననలు పొందాలని సెబ్ జాయింట్ కమిషనర్ బి.అరుణారావు ఉద్బోధించారు. పదోన్నతి పొంది మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలు, సీఐల పాసింగ్ ఔట్ పరేడ్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని పీటీసీ గ్రౌండ్‌లో ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెబ్ జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ.. విధులపై అవగాహన పెంపొందించుకుని, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి మాట్లాడుతూ.. ఏ విభాగంలోనైనా సమర్థవంతంగా పనిచేసి మంచి అధికారిగా పేరు తెచ్చుకోవాలని చెప్పారు. పోలీసు ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏఆర్ దామోదర్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 85 మంది ఎస్సైలు, సీఐలు నాలుగు ప్లటూన్లుగా ప్రదర్శించిన కవాతు ఆద్యంతం ఆకట్టుకుంది. రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహిస్తామని ఎస్సైలు, సీఐలతో ప్రమాణం చేయించారు. అనంతరం బెస్ట్ ఇండోర్ యాక్టివిటీస్, ఆల్ రౌండర్‌గా ప్రతిభ కనబరిచిన పి.పృథ్వీరాజ్(తిరుపతి), బెస్ట్ ఔట్‌డోర్ యాక్టివిటీస్‌లో ప్రతిభ చూపిన డి.దుర్గాప్రసాద్(అంబేడ్కర్ కోనసీమ), బెస్ట్ ఫైరర్‌గా ప్రతిభ కనబరిచిన వి.వేణు(శ్రీకాకుళం)కు ప్రిన్సిపాల్ దామోదర్ మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీరామ చంద్రమూర్తి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, జ్యోతిరాణి, కె.సాంబయ్య, చిరంజీవి, ఆర్ఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన ఎస్సైలు, సీఐల కుటుంబ సభ్యులు, నగరానికి చెందిన వివిధ పాఠశాలలు, కాలేజీల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కవాతు, ఇతర కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు.



పాసింగ్ ఔట్ పరేడ్‌లో ప్రమాణం చేస్తున్న సీఐలు, ఎస్సైలు

ఈనాడు ప్రతుల దహనం

గిద్దలూరు రూరల్: అసత్యాలు ప్రచురించే ఈనాడు పత్రికను ప్రజలు బహిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదేశాల మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఈనాడు పత్రిక ప్రతులను తగలబెట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బుడతా మధుసూదనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఈనాడు పక్షపాత ధోరణితో వ్యవహరించడమే కాకుండా కేవలం టీడీపీకి కొమ్ముకాస్తూ జర్నలిజం విలువలను కాలరాస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆర్.డి.రామకృష్ణ, కౌన్సిలర్లు దొంతా లక్ష్మీదేవి, లొక్కు రమేష్, గడ్డం భాస్కరరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్దన్, షేక్.మస్తాన్‌వలి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దర్ల శ్రీను, శ్రీరాములు, శివాపురం ఆంజనేయులు, బాష, గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో..

దర్శి: ఈనాడు పత్రికలో పాత ఫోటోలు పెట్టి తప్పుడు కథనాలు ప్రచురించిన రామోజీరావు బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ వైవీ సుబ్బయ్య, ఎంపీపీ సుధా అచ్చయ్యలు డిమాండ్ చేశారు. ఈనాడులో తప్పుడు కథనాలు ప్రచురించినందుకు నిరసనగా స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో ఈనాడు పత్రికను తగులబెట్టి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిష్పక్షపాతంగా నిజాన్ని చెప్పాల్సిన ఈనాడు పత్రికలో పాత ఫొటోలు పెట్టి పట్టాభిని కొట్టినట్లు చూపించడం ఆ పత్రిక తప్పుడుదనాన్ని రుజువు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలి మూటి దేవప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు మిల్లర్ బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పత్రికలను తగలబెడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మానవతావాది.. చంద్రశేఖరరెడ్డి

- అప్పుస్మా జిల్లా కార్యవర్గ ఆత్మీయ సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: గొప్ప మానవతావాది.. మన ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అప్పుస్మా) ఆధ్వర్యంలో స్థానిక ఏ-1 ఫంక్షన్ హాలులో శుక్రవారం రాత్రి నిర్వహించిన జిల్లా ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ కరోనా సమయంలో కోట్లు వెచ్చించి ప్రజలకు వైద్య సాకర్యాలు అందించేందుకు చంద్రశేఖరరెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. ధనం ఉండటం గొప్ప కాదని, దానిని వెచ్చించే గుణం కూడా ఉండాలన్నారు. అటువంటి మంచి దృక్పథం ఉన్న చంద్రశేఖరరెడ్డికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. యాజమాన్యాలకు సంబంధించి పాఠశాలల గుర్తింపును మూడేళ్ల నుంచి 10 సంవత్సరాలకు పెంచడం తప్పకుండా చేస్తామన్నారు. అయితే, చట్టసభల్లో సానుకూల దృక్పథంతో వాణి వినిపిస్తే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. అందుకు ఉదాహరణే కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అని అన్నారు. ఈ నేపథ్యంలో మరో మంచి అభ్యర్థిని చట్టసభలకు పంపడం, అందులోనూ ప్రైవేటు యాజమాన్యాలు, ఉపాధ్యాయుల కష్టాలు తెలిసిన వ్యక్తిని పంపుకోవడం ద్వారా తప్పకుండా సమస్యలు పరిష్కరించుకోగలుగుతామన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ వరకు సమస్యను తీసుకెళ్లి ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎన్నికల్లో ఓటు హక్కు తీసుకురాగలిగానన్నారు. ఇది తన మొదటి విజయంగా భావిస్తానని, తదుపరి పాఠశాలల గుర్తింపు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ వంటి సమస్యల పరిష్కారంతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ కాలనీ ఏర్పాటు, ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరి హెల్త్ కార్డులు మంజూరు వంటి వాటిని సాధించాలనే కృతనిశ్చయంతో బరిలోకి దిగుతున్నానన్నారు. ఇప్పటివరకు ఉపాధ్యాయ ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించిన సంఘాలు ప్రైవేటు యాజమాన్యాలు, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను ఎంతవరకు పరిష్కరించేందుకు చొరవ చూపాయో గమనిస్తూ తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానికి అప్పుస్మా జిల్లా అధ్యక్షుడు కె.మాధవరావు అధ్యక్షత వహించగా, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.జాలిరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్, సరస్వతీ విద్యాసంస్థల అధినేత ఏవీ రమణారెడ్డి, అప్పుస్మా రాష్ట్ర నాయకుడు సుబ్బారావు, జిల్లా నాయకులు హనుమంతరావు, నక్కా ప్రసాద్, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు జీ వెంకటేశ్వరరెడ్డి, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి